# అడుక్కుదినక సేసేదేంది!

వూరికి ఎలపల వుండ ఆ పాడుబడ్డ కొట్టు మీన రేత్రిళ్ళు దెయ్యాలు అపత్తా వుంటయ్యాని ఆవూరి జనం సానామంది అనుకుంటారు.

రేత్తిరి పదిగెంటలయింది. కారుసీకటి. యాడ ఏంవుండదీ కన్నుబొడ్సుకుండా కాన్రాటంలా.

ఆ కొట్టుమీన రొండు యిగ్రహాలు కూకునుండై, గర్బగుళ్ళో అమ్మోర్లకి మల్లే. ఒక యిగ్రహం కళ్ళు మెరుత్తావుండయి. రెండో యిగ్రహం కళ్ళు మూసుకునుండై.

"తూత్ యింత సన్నాసివూరు నే నేడా సూళ్ళా" అంది కళ్ళుగల యిగ్రహం.

"అన్నివూళ్ళూ యిట్టనే సచ్చినై!" అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం.

"యింత వుప్పు గోంగూరముద్ద దొరికి మంచీలు తాగేటప్పటికి గనమై పాయె! తిరగంగా తిరగంగా సివరికి ఆ యమ్మ కాత్తె పప్పుశారుండది కావాలా అనడుగుతే అదే పదేలనుకుంటా దోసెట్టో అటనే తాగి సల్లగా యీడకి జేరుకుంటిని."

"యిగ ఈ పానాలు యిట్ట బోవల్సిందేలే! అయినా సావడం అంటే గబిక్కున సావాలిగాని, యిదేంది యిదా పద్దతి? పోనీ, ఆ ముసల్ది ఆడా, నేనీడా, ఆడకి వొదిలిపోద్ది శని" అంటా తుబుక్కున వుమ్మేసింది కళ్ళుగల యిగ్రహం.

"పెల్లాం యాడన్నా వుండదా?" అంది కళ్ళుమూసుకుండ యిగ్రహం.

"పెల్లాం! మా అమ్మ దప్పితే నా కెవరూ లేరు."

"నీకు ఎన్నేళ్లేం?"

"ముప్పయి"

"ఆఁ! మాటపోకడ జూత్తే యాబయ్యేళ్ళకిమల్లే వుండది! బలేవోణ్ణే!" అన్నది కళ్ళుమూసుకుండ యిగ్రహం.

కూసేపు ఆగిపోయినై యిగ్రహాల మాటలు.

"యిదుగో, నిదరబోతుండావా?" అంది కళ్ళుమూసుకుండ యిగ్రహం కొంతలెక్కపోయినాక.

"నిద్ర రావటంలా నాకు" అంది కళ్ళుగల యిగ్రహం.

"ఎవరన్నా యిటనే జతపడ్తా వుంటారా, అదిదంటా ఏదన్నా కూసేపు మాట్టాడంది నాకు దోసదు సెప్పొద్దూ."

"నువామాట అనకుండా వుంటే యింకూసేపు జూసి నేనే అడిగేవోణ్ణి. అసలీ చీకటి తిక్కెట్టిత్తుందది !"

"నా కా దిగులేం లేదులే !" అంది కళ్ళు మూసుకుండ యిగ్గహం.

"ఔను. మరీ నయం. పెపంచకం అవజాన లేంది సోకే లేదూ !"

"మీకి ఏ వూరేం ?"

"అసలు దద్బాదిన రెట్టపాడయితే నందెలుగు వొచ్చేశారు మా అయ్యోళ్ళు."

"నందెలుగు ఏవిఁటికి రావల్సొచ్చిందీ ?"

"అఁ అడుక్కుదిన్ను ! యిప్పుడెందుకులే ఆ పురానం."

"అదిగో, అదే సిటుక్కుమంటది పానం ! ఏందో యియ్యాలుండి రేపు సచ్చేదానికి- నువుగాంగా ఆ మాటన్నావు ! మంచీసెబ్బరకొత్తే నువెంతో నేనంతే, ఏమంటా ?"

"అంతేలే యెదవ బతుకులు."

"మరింకేం !"

"వుండ కొత్తెకూత్తె బావిఁ తుడుసుబెట్టుకుపోతే, కొత్తెబతికిన వూళ్ళో దేనికయినా నగుబాట్లపనవుద్దని నందెలుగో బొందెలుగో వొచ్చేశాడు మా అయ్య" అంది కళ్ళుగల యిగ్గహం.

"ఆహాఁ ? ముంగల కొత్తె బావిఁ వుందన్నమాట. ఎంతేం ?"

"ముండెకరాల మెట్ట."

"అబ్బా ! బాగానే తింటానికి వుండదన్నమాటా ! తాగుడుగాని ముండలుగాని మరిగాడెట్టా మీ అయ్య ?"

"ధా ! మా అయ్య మంచోడు. పోవటమే నడమంత్రంగా పోయిందయితే!"

"అంటే ?"

"మనగాడి సజ్జ పంట పండేది మా బావిఁలో. తింటానికి కొంటానికి అదే నయమని ఏటా అదేపంట ఏసేవోళ్ళం. కొత్తపంట రాంగానే ఆ కోఁవటి సెంచయ్య కాడ మిరబగాయ బొరబగాయ తాలూకు సేసిన అప్పు, యింకేవన్నా సిల్లర బొల్లరవి వుంటే తీర్చిబారేసి మిగతాయన్ని ఫరిగట్టి బోసేది. మళ్ళీ వొచ్చే ఏటి పంటలొచ్చేదాకా ఆ యావజాన తిండికి సరిపోతా వుండాల్సిందే. ఈ లోగా సెంచయ్య నాలిక దీక్కుండా ఒక్క గిద్దెడు గింజలన్నా బోసేవిలేదు."

"మరి యింటిముంగల కొచ్చే సెక్కురాలూ ముంతకజ్జాయం యిట్టాటియి కావల్సొంటే డబ్బులుండేయా ?"

"డబ్బుగిబ్బు మన కవసరమే పుండేదిగాదు అప్పట్లో. అదుగో నువ్వు జెప్పినట్టు అయ్యేయన్నా కావాల్సొత్తే గిద్దో రెండుగిద్దలో సజ్జలే బోత్తే పని గడ్సి పొయ్యేది."

"ఏడాదంతా తిండికిమటుకు బాగా సరిపొయ్యేదంటావ్ ?"

"తరుగులు బొరుగులుండా ఇబ్బందిమటు కుండేదిగాదు."

"ఏడాదంతా బాకీలడక్కబోటం జూత్తె మీ వూరి కోవంటి సెంచయ్య మంచోడల్లే వుండే?"

"అదా? అణ్ణి జూత్తేనే నా కసలు మొదట్నుంచీ గిట్టేదిగాదు. పంది కొక్కులుండయి జూశా- ఆదీ ఆడి బుద్ధి. అప్పుడో పన అప్పుడోపనంటా మా సొప్పంతా ఎత్తికెల్లి అళ్ళ బర్రెల్ని మేపుకునేవోడు. ఎప్పుడన్నా అవసరానికి అప్పుబెడ్తే సెంచయ్యేగందా అని మా అయ్య అణ్ణం అనేవోడు గాదు."

"మరి ఆళ్ళబుద్ది అసువంటిదీ."

"కాత్తె ఒకేడు పంట ఎచ్చుతగ్గయితే ఒకట్రొండుబత్తాలు ఎక్కువ జేసుకుని బాకీ పైయ్యేటిదాకా ఆపేవోడేలే. మరి వాన్దేపుడిమీన ఆదారపడుంటదిగా మన పానం ?"

"అందుట్లో మెట్టసేలాయె."

"యింతకీ మా రోజులు బాగుండకబోతే ఎవురేం జేత్తారు? అప్పటికే కొంత బాకీ నిల్సింది సెంచయ్య కాడ. ఒకేడు అసలు బొత్తిగా లేకపోటం- పైయ్యేటికి గాలివానలు దంచి సేలన్నీ మురుగెత్తటం వరసొరసన జరిగింది. మూడోఏటికి సెంచయ్య గబిక్కిన మొత్తంబాకీ ముంగలబెట్టి అదంతా అప్పుడికప్పుడు కక్కక పోతే కోరుటుకెక్కుత్తానని మా అయ్యను పొలం పంటమీనుండగా నిలేశాడు. యింకేం లాబం లేకబోయింది. వొడ్డీలు గిడ్డీలు మొత్తంజేరి తొమ్మిదొందల రూపాయల పైసిలుక్కు మా మూడెకరాల బూవీ బాకీకింద కట్టుకుండాడు సెంచయ్య. రొండురోజులు బోనిచ్చి మా గుడిసె వుండ స్తళం అయినకాడికి తెగ నమ్మి ఒక రాత్రి మమ్మల నందెలుక్కు పయానం గట్టిచ్చాడు మా అయ్య. అంతే. రెండుమూడు నెల్లుండి అయ్య జరంతో సావనే సచ్చాడనుకో" అంది కళ్ళుగల యిగ్రహం.

"ఆరెరెరెరె ఎట్టాంటి పన్జరిగిందీ! నిచ్చేపవంటి బూమి ఆవజాన నీలు

గారిపోయిందన్నమాట ! హుఁ !" అన్నది కళ్ళు మూసుకుండ యిగ్రహం యిశారంగా.

"మొదులు ఒల్లూ కాలూ గుల్లయి, అలివేలు సంగతి అట్టయితే దిక్కులేదు గాని ఎప్పుడో ఏందో పోయిందానికి ఎవుడో ఏడ్చాడంట !" అన్నది కళ్ళుగల యిగ్రహం యిసిరేసినట్టు

"ఒల్లూ కాలూ గిలంటండావేందీ ?"

"మరిగనేంది ! అసలాడ ఏంలేందే యీ కొట్టుమీనకొచ్చి సీతో కూకుండానంటా ? యీ కాల్తోగాడూ నా కతంతా అడ్డం దిరిగిండీ ! లేకుంటే నా జనమలో ఒకణ్ణో కానీ దేబిరించి ఎరుగుదునా ? ఎనకటికి శాస్త్రం వుండదిలే, బోడిగుండుమీన గొబ్బిరికాయ పడిందని ! యింతకీ సెని తంతావుంటే యీ యదవకి అలివేలు ఎట్ట దక్కుద్దిలే !" అంటావుంది కళ్ళుగల యిగ్రహం.

"ఏంది నువనేదీ ?" అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం.

"నా సంగతేలే !"

"ఎవురో అలివేలంటంటే ఏం దబ్బా అనుకుండా !"

"నందెలుగులో ఒక కుర్రదిలే."

"పానం దీత్తివే ! అయితే అలివేలు వుండదన్నమాట ?"

"నా బతుకు సాలా సెండాలబ్బతుకన్నా !"

"యింకో నిమసానికి ఏంజరుగుద్దో మనికి తెలవదు గందా ? మనవి వొట్టి ముదనష్టబ్బతుకులు "

"నందెలుగులో మొదట అలివేల్ని వరికోతలకాడ సూసీ సూట్టంతలికే తిక్కబుట్టిందంటే నమ్ము. అసలట్టాటిదీ అలివేలు. యింకెవురయినా దానిముంగల బలాదూరే ! అల్లమ్మ రంగమ్మ- గుర్రాలుంటయి తెల్సుగా ? తెగఎగురుద్దీ ; దాంతోనే వొచ్చిందీ సావంతా. ఓనాడు ఏమయినా అవుద్దని ఎల్లి అలివేల్ని పెళ్లి జేయమన్నా."

"ఏమంది గు- రంగమ్మ ?"

"యీలుగాదంది "

"ఏందీ యీలుగాందీ ?"

"రంగమ్మ పెళ్లి యీలుగాదంది."

"మరి అలివేలుకు నువంటే గురేగా ?"

"పడి సచ్చిద్ది."

"మరి రంగమ్మ ఏమంటదీ?"

"తన కూతుర్ని పోషించను నా కాడ డబ్బులేదంట."

"అసి యదవా— పేసీ బెట్టిందే?"

"కాళ్లకి కడాలూ, సెవలకి దుద్దలూ, ముక్కుకి పుడకలూ సేయిత్తే, ఒక ఏళ నాకు గుబుల్దిరిగి అళ్ళమ్మాయిని వొదిలేసినా అటితో కొన్నాలన్నా తన కూతురు బతకొచ్చునంట!"

"మరి నువేమన్నా?"

"అంటానికి నాకాడేం వుండది బూడ్దె? రోజంతా కూళ్లేస్తేవొచ్చిన ఆరనాలో అద్దరూపాయితోనో మా అమ్మ నేను తినంగా యింకేం వుంటందాడా? అసలు మా అయ్యా పొలంగిలం పోసూక్కొని నందెలుగు సేరాడని తెలిసే అది పేసీ బెట్టింది."

"అలివేలేమంటదీ?"

"అదేమంటది, అమ్మన్నూత్తే అడలయితే. మండి— రంగమ్మని ఏందేందో అంటా లెగిశా"

"ఆఁ?"

అంత రోసం గలాడివయితే యాడకన్నా ఎల్లి డబ్బు సంపాయించుకు రారాదా అనింది రంగమ్మ. ఒక యాడాది అలివేల్ను నా కోసం వుంచుతానని మాటిత్తే అటనే సంపాయించ్చుకొత్తానన్నా. వుంచుతానంది రంగమ్మ. యీ యవారం తనకి నచ్చక బోయినా, ఎల్లి ఎప్పుడొత్తానో కనిబెట్టుక్కూకుంటానంది అలివేలు... ఎంటనే నందెలుగునుంచి బయలెల్లా. ఎల్లీ ఎల్లీ ఎల్లీ- ఎటనయితేనేం సివరకి రేత్రింబగలూ పన్జేత్తే రూపాయిపావలా గిట్టుద్దని తెల్సి సాల్లే బగమంతుడా అనుకుంటా బెజవాడలో రామసెంద్రయ్యాగారి ఏడ్జెనక్కాయ ప్యాక్టరీలో బత్తాలు మోసే పనికి వొప్పుకుండా. అది సానా పెద్ద ప్యాక్టరీ. ఆడ యినప్పన్లవి యింకా సానావుంటాన రామసెంద్రయ్యగారికి ఏలకి ఏలు లాబాలుండేవి. బలేచోటపడ్డాం గందా, ఎటనోగట్ట ఏడెందిమాసాలు తంటాలుబడ్తే అలివేల్ను పెళ్లిచేసుకోవచ్చు గందా అనుకుంటా, రామసెంద్రయ్యగార్ని మెప్పిత్తా, అందరికన్న మిగులుగా బొహువుసారుమీన సెక సెకా బత్తాఎంటబత్తా మోత్తా పొయ్యేవోణ్ణి. తిండికి పావలా ఆరనాలకన్నా కరుజుపెట్టకుండా రోజుకి రూపాయో పద్దాలుగణాలో ఎనకేత్తా వచ్చా. ఆవజాన రెణ్ణెల్లు గడిసేతలికి ఒల్లు కాత్త సెట్టం మొదలుబెట్టింది. ఆ బెజ వాడ నీలు వుత్త సన్నాసినీరు గావాఁలా, వొల్లు ఎచ్చుగా వుంటం మొదులు

బెట్టింది. పదిరోజులు వొంటిపూటే పన్జేసి కాత్తె సుమారుగా వుండమీదట మళ్లీ మామూలుగా పనిజేత్తా వొచ్చా. ఒకరోజు రేత్తిరి ఎయ్యి ఏడ్డెనగ పప్పుబస్తాలు మేం పదిమందిమి లోన గోతాలమీన పేరవాల్సొచ్చింది. మోసేబత్తా ఏసేబత్తా-లెగిసిపోతుండయి బత్తామీనబత్తా. రేత్తిరి రొండుగంటల యాలకు నా ముంగల బత్తామోసే కోటయ్య నెత్తిన బత్తాలో నిచ్చెన సివరకంటా ఎల్లాడు-నేను రొండు మూడు మెట్లెక్కా-వొల్లు తూలింది-యిగ నాకు తెలవదు ఆమీన ఏం జరిగిందీ... మూడోరోజుగ్గాని నాకు తెలివిరాలా- అప్పటికి రొండుదినాల కిందటే యీ కుడి కాలు తొడలకాడికి ఆపరేసను జేశారంట."

"అరే, అలే ఎంతపన్జరిగిందీ—"

"నిచ్చెన ఎక్కు-తుండోణ్ణల్లా అరుత్తా కల్లుదిరిగి అటనే పడ్డానంటా. ఆ అదురుడికి అదిరిపోయి కోటయ్య బత్తా అటనే వొదిలేసేతలికీ- కిందబత్తామీనగా ఎత్తికిల పడుండ నా కుడికాలుమీనకి ఒచ్చి సరీగా పడిందంట"

"రామ రామ రామ... రామసెంద్రదయగా రేమన్నాడూ ?"

"ఆయనేం జేత్తాడు నాకా వజాన రాసుంటే ! రొండుమాసాలు ఆస్పత్రిలో మందేపించాడు, సాలు."

"ఎన్నాళ్లయింది యిది జరిగి ?"

"రొండేళ్ళయింది."

"మరి అలివేలూ ?"

"యింకేం అలివేలు !" అంది కళ్ళగల యిగ్రహం.

ఏందో అనబోయి అటనే ఆగిపోయింది కళ్ళుమూసుకుండ యిగ్రహం.

(అభ్యుదయ, 1948 డిసెంబరు)

*